

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

**బార్‌లో బిల్లు చెల్లించాక** ఓ తాగుబోతు వెయిటర్‌కి టిప్పు ఇవ్వబోతూ అడిగాడు.

"ఇంతదాకా నీకు ఎవరయినా సరే టిప్‌గా యిచ్చిన అతిపెద్ద మొత్తం ఎంత?"



"వందరూపాయలండీ.." జవాబు చెప్పాడా వెయిటర్.

ఆ తాగుబోతు వెంటనే వెయిటర్ చేతిలో నూటయాభై రూపాయలుంచి చెప్పాడు.

"ఇంకోసారి ఎవరయినా ఈ ప్రశ్న అడిగితే నూటయాభై రూపాయలు నేను ఇచ్చానని చెప్పు. అర్థమయిందా?"

తలూపాడు ఆ వెయిటర్.

లేచి బయటికి వెళ్ళబోతూ అడిగాడు ఆ తాగుబోతు, వెయిటర్‌ని.

"ఇంతకీ ఆ వందరూపాయలు టిప్ ఇచ్చింది ఎవరు?"

"మీరేనండీ.." జవాబు చెప్పాడా వెయిటర్.

❀❀

.

చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

పార్వతమ్మ పిల్లల బాగోగులు చూసే ఆయాగా పనిచేయడానికి ఓ అమ్మాయి కావాలని ప్రకటన ఇస్తే మరునాడు ఒకామె వచ్చింది.

"నీకు చిన్నపిల్లలతో గడిపిన గత అనుభవమేదైనా ఉందా?" అనడిగింది పార్వతమ్మ.

"లేకేం. స్వయంగా నేనే చాలా రోజులపాటు చిన్నపిల్లగా ఉన్నాను" అందా అమ్మాయి.

బజార్లో ఏదో అల్లరి జరుగుతున్న సమయంలో అరెస్ట్ ఐన ఒక వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

రిపోర్టు రాసుకుంటూ ఎస్.ఐ అడిగాడు "నీ వృత్తి ఏమిటి?"

"నేను రచయితని" అన్నాడా వ్యక్తి.

"అబద్ధం చెపుతున్నట్లున్నాడు సార్. ఇతని జేబులో వందరూపాయలనోటు దొరికింది" అన్నాడతన్ని తీసుకొచ్చిన పోలీసు ఆ నోటు టేబుల్‌మీద ఉంచుతూ.

"ఒరేయ్ రాజూ! నీ రిజల్ట్ ఏమయింది?" అడిగాడు తండ్రి.

"ఫస్ట్ వచ్చాను నాన్నా!"

"వెరీగుడ్ తరగతిలోనా లేక స్కూల్ మొత్తంలోనా?"

"తరగతిలో వెనకబడ్డవాళ్ళలో మాత్రమే ఫస్ట్ అని చెప్పాడు టీచర్."

"ఈ నదిలో మునిగిపోకుండా రక్షించావు నువ్వు. ఈ పది రూపాయలు తీసుకో" యిరవై నోటు ప్రాణదాతకు ఇస్తూ అన్నాడో ధనవంతుడు.

"చిల్లరలేదు సార్. దీన్ని నా దగ్గర ఉంచేసుకుంటాను. ఈసారి మీరు మునిగిపోయినప్పుడు ఛార్జీలేకుండా బయటకి తీస్తాలెండి. ఇప్పుడే మళ్ళీ దూకుతానన్నా నాకు అభ్యంతరంలేదు.."

ఓ అయిదుగురు పిల్లల తల్లి బస్సులో తన వెనకసీట్లో సిగరెట్ తాగుతున్న ఓ యువకుణ్ణి కోపంగా చూస్తూ

"బస్సులో పొగతాగరాదు అని రాసుంది చూడలేదూ?" అంది.

"చూడకేం? ఆ పక్కనే యిద్దరు లేక ముగ్గురుపిల్లలు చాలు అనికూడా ఉంది. అంతమాత్రాన అందరూ అది పాటిస్తున్నారా?" నవ్వుతూ అడిగాడా యువకుడు.

సినిమానటి నగ్నమాలిని పెళ్ళి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన పార్టీలో మూగిన విలేఖరులతో అంది.

"నేను నా కొత్త భర్తకు అన్ని విషయాలూ చెప్పేశాను. నేను చేసిన తప్పులూ, నా బాయ్‌ఫ్రెండ్స్, పేర్లుకూడా  వివరంగా చెప్పేశాను" అంది.

"ఆహా, ఏమి నిజాయితీ.. ఏమి జ్ఞాపకశక్తి" అని పొగిడారు విలేఖరులు.

"కాలం గడిచాక ఓసారి పాత ఉత్తరాలు తిరిగి చదువుకుంటూ ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది సుమా."

"అవును. వాటికి జవాబు రాయనవసరంలేదుకదా."

"ప్రియా! నాకోసం చావు ముందుకి కూడా ఎంతో ధైర్యంగా వెళ్తానని అన్నావుకదా! అదుగో ఆ వస్తాదు ముందుకు  పోయి నిలబడగలవా?

"ఓస్! అదో లెక్కా! కావాలంటే ఆ మాట ఇప్పుడు కూడా అంటాను. కానీ ఆ వస్తాదు ఇంకా చావలేదుకదా! ఎలా వెళ్ళను?"

"ఈరోజు సినిమా ప్రోగ్రాం కేన్సిల్" అన్నాడు భర్త.

"భలేవారే. ఉదయ మీరు ప్రోగ్రాం వేసినప్పటినుండి మేకప్ చేసుకుంటూంటే తీరా యిప్పుడు బయల్దేరే టైముకొచ్చి అలా అంటారేం?"

"డాక్టరుగారూ! బాగా నిద్రపట్టడానికి మాత్రలేమన్నా ఉంటే ఇవ్వండి" అడిగాడు రాజు డాక్టర్ని.

"నీలాటి చిన్నపిల్లలు అవి వాడకూడదు బాబూ" అన్నాడు డాక్టర్.

"అబ్బే.. ఇవి నాక్కాదు. మా నాన్నగారికి ఆయన నిద్రపోతేనేగాని మాకు ఆడుకోవడానికి వీలుండదు."

COMMENTS